# వెర్రిపిల్ల

సాయంకాలం ఆరుగంటలు. నీరెండల కాంతులలో వీధిఅంతా కలకల లాడుతూంది.

"జానీ, నువ్వు ఇవాళ ఎంత బాగున్నావో తెలుసా ?" అంది రాజేశ్వరి.

"నీ యోగ్యతాపత్రానికి ఎంతో కృతజ్ఞతే గాని, ఈ పొగడ్తలు చాలుగానీ, దయిచేసి ఇంకేదయినా మాట్లాడమని ప్రార్థన" జానకి సగం వేళాకోళంగా అంది.

"నేనే మగవాణ్ణి అయితే నిన్ను పూలలో పెట్టి పూజించి ఉందును. ఆ అవకాశం రానందుకు బాధగా ఉంది!" హాస్యం ఆడింది రాజేశ్వరి.

"పాపం!"

"ఆ అబ్బాయి చూడు, ఇంకొంచెం ఉంటే సైకిలు మీదనుంచి పడును. మనస్సు, దృష్టి ఇటువుంటే దారేం కనపడుతుంది ?" కొంటెగా అంది రాజేశ్వరి.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"అయినా, ఆ దేవుడు అంత అందమూ ఒక్కళ్లకే ఇవ్వకపోతే కాస్త అందరికి పంచిపెట్ట కూడదూ!"

"మనకి కావలసిన బస్ తప్పించి, మిగతా వన్నీ వచ్చి వెళ్లిపోతూంటాయి చూడు. అలాగే, ఈ ప్రపంచంలో మనకి కావలసినవి దొరకవు. మిగతావన్నీ ఉంటాయి." జానకి నిర్లిప్తంగా అంది.

"పద్ధెనిమిదేళ్ల బంగారు వయస్సులో ఈ చచ్చు వేదాంత మెందుకే వెర్రిపిల్లా ?"

జానకి మొగంలోకి చూసి నవ్వింది రాజేశ్వరి. ఆమె తల దించుకుంది. మనస్సులో బాధ ముఖాన్ని నల్లబరుస్తుంది. వాలిన కనురెప్పలు రెండు మూడు నిముషాలు పైకి లేవలేదు.

రాజేశ్వరి కొద్దిసేపు ఆమెవంక చూసి ధోరణి మార్చుకుంది.

"క్షమించు జానకీ, మరోలా అనుకుంటావని అనుకోలేదు ?"

"ఇందులో అనుకోడానికీ, క్షమించడానికీ ఏముంది ! నువ్వేం తప్పు మాట అన్నావు ?" పేలవంగా నవ్వింది జానకి. రాజేశ్వరి జానకి వంక అయోమయంగా చూసి, ఏదో అడగబోయి మానుకుంది.

ఇద్దరూ మౌనంగా కొద్దిదూరం నడిచారు. పార్కు దగ్గిరికి వచ్చారు.

"రాజూ, చూడు నేనొకటి చెపుతాను వింటావా ? ఇవాళ సినిమాకి పోవద్దు. మరెప్పుడైనా వెళ్ళవచ్చు. కాస్సేపు ఈ పార్కులో కూర్చుని మాట్లాడుకుని ఇంటికి వెళదాం ! ఏం ?" జానకి గేటు దగ్గిర నిలబడి అంది.

"అదేమిటి ? ఇవాళ నువ్వు పరీక్ష ప్యాసు అయ్యావు కాబట్టి నాన్నగారు ఇద్దర్నీ సినిమాకు పంపించారు. రోజు మనకు కావాలన్నప్పుడల్లా పంపుతారా ?"

"నాకేమిటో పాతవన్నీ గుర్తుకు వస్తున్నాయి. నేను సినిమా చూడలేను !"

"ఆ జ్ఞాపకాలు పోవడానికైనా సినిమా చూడాలి. తప్పకుండా."

"అంతకన్న నీలాంటి ఆప్తురాలితో అవన్నీ మనస్సు విప్పి చెప్పు

కొంతే కొంత ఉపశమనంగా ఉంటుంది. రా, రాజు, కొంచెంసేపు కూర్చుందాం" ప్రాధేయపడుతున్నట్లు అడిగింది జానకి.

రాజేశ్వరి కాదనలేకపోయింది. ఇద్దరూ మందార చెట్టుచాటున గడ్డి మీద కూర్చున్నారు.

"నువ్వు 'వెర్రిపిల్లా!' అనగానే ఎందుకలా అయిపోయానో చెప్పనా? నువ్విలా అన్నావని గాదు!.... కాని మాఅమ్మ నన్ను గురించి అలాగే అనేది. ఎప్పుడూ అలాగే పిలిచేది. అందుకే ఆ రోజుల జ్ఞాపకాలు వెంటాడు తున్నాయి, ఆమాట వినగానే."

"మీ అమ్మగారు నువ్వు పుట్టగానే పోయారన్నావుగా?"

"అవును, అమ్మ పోయింది. నాన్న మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆమే నన్ను పెంచింది. ఆమె మాటే నేను చెప్పేది."

రాజేశ్వరి మాట్లాడలేదు. జానకి తత్వం ఆమెకు తెలుసు. పిల్లగాలికి కదిలే ఆకులకేసీ, గడ్డిమీద ఎగిరే ఏవో పురుగులకేసీ నిర్లిప్తంగా, అమాయకంగా చూసే ఆకళ్ల వెనక, అఖాతాల లోతు లున్నాయని ఆమె ఎరుగును. కదిలిస్తే ఆ లోతులోకి వెళ్లిపోతుందనీ తెలుసును.

"నేను చిన్నప్పటినించి ఇలానే ఏవో నాకే తెలియని ఆలోచన లలో ఇరుక్కుని, చుట్టు పక్కల సంగతులు పట్టించుకునేదాన్ని కాదు. ఇంట్లో నాతో కబుర్లు చెప్పడానికి, ఆడుకోడానికి అక్క చెల్లెళ్లు, అన్న దమ్ములు లేరు. చదువు వీధిబడి చదువుతోనే ఆగిపోయింది. అసలే పల్లెటూరు! నాన్న పోయేనాటికి పన్నెండేళ్లు! తరవాత అసలు ఇంటిబయటికి కూడా పోనిచ్చేది కాదు అమ్మ! నాలుగు గోడల మధ్య జీవితంలో, చివరికి అదొకరకం మందమరుపుగా, మొద్దులా తయారయాను!"

"నాన్నగారు నిన్ను ఆ పాత విషయా లెత్తవద్దన్నారా? మళ్లీ

అవన్నీ ఎందుకు వల్లిస్తావు ? లే, సినిమాకి." రాజేశ్వరి లేచింది.

"నేనిప్పుడు ఇదివరకటి మనిషిని కాదులే ! అవన్ని జ్ఞాపకం వచ్చినంత మాత్రాన పోయిందేంలేదు. అమ్మ నన్నెప్పుడు, 'వెర్రి మొద్దు, జడ్డిమాలోకం, వెర్రిపిల్లా !' అని పిలిచేవి. నువ్విప్పుడు మళ్లీ ఆమాట అంటే అదంతా గుర్తుకు వచ్చింది. ఎలా ఉండేదాన్ని ! ఎలా మారాను ! అంతా గుర్తుకు వస్తే ఆశ్చర్యంగా ఉంటుంది నాకే" అదోలా నవ్వింది జానకి.

"గుర్తుకువస్తే మరిచిపోవాలిసిందే, నేనేం వినదల్చుకోలేను. రా, పోదాం."

రాజేశ్వరి చెయ్యి పట్టుకు లాగుతూంటే జానకి తప్పనిసరిగా లేచింది. ఇద్దరూ పక్కన సినిమాహాలుకి నడిచారు.

సినిమా అంతా పాటలు, నృత్యాలు, నవ్వులు, కేరింతలతో గడిచింది. తెరమీద దొర్లే ప్రతి దృశ్యంమీదా: పలికే ప్రతి మాటమీద రాజేశ్వరి హాస్యంగా వ్యాఖ్యానిస్తూంటే జానకి ఆ మూడు గంటలూ మరో ప్రపంచం లోకి వెళ్ళిపోయింది.

జానకి సుమారు మూడేళ్ళనించి డాక్టరు ప్రసాద్‌గారి ఇంట్లో ఉంటూంది. ఆమెది అనేకరకమైన వ్యాధి. ఆమె చుట్టూ పరి సరాలు, పరిస్థితులు మనస్సుకి కోత పెట్టేవిగా తయారయితే, వాటికి తట్టుకోలేక, వాటినించి విముక్తిలేక, ఆమె సున్నితమైన హృదయం తీవ్రంగా గాయపడింది. ఏవేవో పాడు ఆలోచనలు విపరీతంగా వేధిస్తూంటే, తట్టుకునే శక్తిలేక ఆమె ఒకరకం మూర్ఛలోకి వెళ్ళిపోయేది. ఆ కొత్త మానసిక స్థితిలో ఆమె ఎవరో ఏమి గుర్తు ఉండేదికాదు. ఆమెను కలవరపెట్టే ఆలోచనలే మాటలరూపంలో ఆమె నోటంట వచ్చేవి. శరీరం, మనస్సు వశంలో

ఉండేవిగావు. ఒకోసారి ఎన్నో గంటల కొద్దీ, ఆకలిదప్పులు లేకుండా నిద్రలో మగతలో గడిచిపోయేవి మరొకప్పుడు అలా దిగాలుగా రోడ్డు మీద వెళ్ళి పోయేది ఎంతో దూరం. ఏటిగట్టున, శివాలయం మండపం మీద, తోటలమధ్య స్పృహలేకుండా పడి ఉండడం చూసి ఎవరో చెప్పాక, ఇంటికి చేర్చేవాడు ఆమె భర్త. ఏవేవో నాటు వైద్యాలు చేయించాడు, దేవుళ్ళకి మొక్కులు దెయ్యాలకి దెబ్బలు అన్నీ అయ్యాయి.

చివరికి డాక్టరు ప్రసాద్ ఆమెని మళ్ళీ మనిషిని చేశాడు. ఆమె మనస్సు చెదిరిందని, తిరిగి కుదుటపడాలంటే కొంతకాలం, కొన్నేళ్ళు ఆ పరిసరాలకు, మనుష్యులకు దూరంగా ఉండాలని గుర్తించారాయన. ఆమెను తమ ఇంట్లో కలుపుకున్నారు. రాజేశ్వరితో సమానంగా ఆమెకు అన్నీ ఇచ్చారు. ఆమె గదిని అందమైన అలంకరణలతో, చక్కటి పుస్తకాలు దృశ్యాలతో నింపారు. ఆమెకు ఏదయినా కావాలన్నప్పుడల్లా అది అందించే మనిషి, స్వంతచెల్లెలిలా చూసుకునే రాజేశ్వరి, దయామయుడైన పితృ ప్రేమ చూపించే డాక్టరు, ఆ పరిస్థితుల్లో ఆమె కొద్ది నెలల్లోనే మామూలు మనిషి అయింది. ఏదో ఒక ధ్యాస, పని కల్పించడంకోసం మెట్రిక్‌కి కట్టించారు. జానకి కష్టపడి చదివింది. ఆరోజు ఆమె పరీక్ష ఫలితాలు తెలిశాయి. అదొక కొత్త అనుభవం ఆమెకు జీవితంలో!

సినిమా పూర్తి అయింది.

"అబ్బా! ఎన్నాళ్ళయింది, కొత్త మంచి సినిమాచూసి, ఈ పాడు వూరికి ఎంతసేపూ యుద్ధాలు, దోపిడీలు, హత్యలు, కత్తి యుద్ధాలేవచ్చేది!" రాజేశ్వరి నడుస్తూ అంది.

"అస్తమానం నవ్వుతూనే ఉండాలంటే ఎలా? అప్పుడప్పుడు కొంచెం చావులూ, ఏడుపులూ కూడా రుచిచూడాలి! అదే నిజమైన జీవితం!" జానకి అంది.

"ఏమో! నాకిలా ఎప్పుడూ నవ్వుతూ పేలుతూ ఉండాలని ఉంటుంది! పెద్దయ్యాక నేనెన్నడూ ఏడవలేదు. అదంటే అసహ్యం!"

"అదృష్ట వంతులు మీరు, వెలుగు పొందగలిగిన అదృష్టవంతులు! అభాగ్యులం మేము! సరిహద్దులు దొరకని సంధ్యలో మా సంచారం.

"మహాకవి మాటలు బాగానే బట్టీ పట్టావు సంతోషించా గాని కాస్త మామూలు మాటలు చెప్పు!"

"ఏమున్నాయి మామూలు మాటలు? నాకంతా అగమ్యగోచరంగా ఉంది. పరీక్ష వ్రాసయ్యేదాకా ఆ ధ్యాసలోపడి మిగతావన్నీ మరిచిపోయా ననుకో! కాని ఇప్పుడా మెట్టు గడిచాక, తరవాత ఏమిటి? ఇకమీదట రోజు లెలాగడుస్తాయి? నా గమ్యం ఏమిటి? ఏం చెయ్యాలి? అన్నీ ప్రశ్నలే?"

"సఖీ గిన్నె నింపు. మన కాళ్ళ క్రిందనించి కాలం ఎలా కొట్టుకు పోతూందో ఎన్నిసార్లు చెప్పుకున్నా ఏం ప్రయోజనం? ఇంకా పుట్టని రేపు, పుట్టి చచ్చిన నిన్న—వాటిని తలుచుకుని చిరాకుపడకు! ఈ రోజు హాయిగా తాగి అన్నీ మరచిపోదాం, ఇప్పుడు అనే ఈ క్షణమే మిగిలింది మనకు" అంటాడు ఉమర్ ఖయ్యాం! అలాగ...."

"రాజీ, అందరూ ఉమర్ ఖయ్యాంలే అయితే, ఈ లోకం ఇంత చిత్ర విచిత్రంగా ఉండదేమో!"

"అందరిగొడవా మనకెందుకు? మనసంగతి మనం ఆలోచించు కుందాం. జానీ, నిజంచెప్పనా, నాన్నగారు నీకోసం అంతా ఎప్పుడో నిర్ణయం చేశారు. నువ్వేం దిగులుపడకు. గడిచిందంతా పీడకల అనుకుని మరిచిపో, నువ్వింక ఎన్నడూ ఆ చాయలకి వెళ్ళవు. నువ్వు నాతోబాటే!"

జానకి మాటాడలేదు; ఇద్దరూ ఇల్లు చేరారు.

"మరోసారి అభినందనలు చెపుతున్నానమ్మా జానకీ! అయిదో తరగతి స్థాయితో మొదలు పెట్టి రెండున్నర ఏళ్ళలో మెట్రిక్ పాస్ కావడం సామాన్యమైన పనిగాదు. నీ తెలివి తేటలు, పట్టుదల చూస్తే నాకెంతో గర్వంగా ఉంది" అన్నారు డాక్టర్ ప్రసాద్ పొద్దున్నే గదిలోకి వచ్చి.

"అంతా, మీ ఆశీర్వచన ప్రభావం నాన్నగారు" సిగ్గు పడింది జానకి

"మూడేళ్ళ క్రితం నువ్విక్కడికి వచ్చినప్పుడు ఎలా ఉన్నావో, తలుచుకుంటే, ఇప్పుడు నువ్విలా మామూలు మనిషివి అయినందుకు ఎంతో తృప్తిగా, ఆనందంగా ఉంటుంది. ఉత్తి మామూలు మనిషివి అవడమే కాదు, ఈ రోజు నీలో ఎలాంటి పరిస్థితులున్నయినాసరే తట్టుకోడానికి తగిన నిబ్బరం, సత్తువ ఉన్నాయి"

"అది కూడా మీరు పెట్టిన భిక్షే !"

"నేను చేసిందేముంది జానకీ ! నిన్ను బాగు చేయాలని నాకుంటే మాత్రం, నీవు సహకరించకపోతే నేనేం చెయ్యగలిగిఉండేవాడిని ? సరే, అది అలాఉంచు. నీకో విషయం చెప్పాలమ్మా ! అది ఇంతకాలం నీనుంచి దాచి క్షమించరాని నేరం చేశాను"

"నాన్నగారూ ! మీరలా మాట్లాడుతుంటే నన్ను చాలా కించపరుస్తున్నట్టుంది. ...."

"నీది చాలా ఉదాత్తమైన మనసన్న సంగతి తెలుసునమ్మా !.... నువ్విప్పుడు ఒక పెద్ద కూడలిలో ఉన్నావు. ఇటుపైన ఎటు వెళ్ళవలసినదీ నిర్ణయించుకునే ముందు నిదానంగా, నిబ్బరంగా, ఆలోచించుకోవాలి. నువ్వు మెట్రిక్ పాస్ అయి, కొంత మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని

పొందేదాకా ఎలాంటి ఇతరాలోచనలకు అవకాశం ఇయ్యకూడదని, నీవ్యక్తి గతమైన విషయాన్ని ఒకదాన్ని నీనించి దాచాను ఈ రెణ్ణెల్లు. నువ్వేమను కుంటావో తెలియదు." డాక్టరు వేళ్ళతో గడ్డంమీద రాసుకుంటూ సంది గ్ధంలో పడ్డాడు.

"ఫరవాలేదు. చెప్పండి, మీరేం చేసినా నామంచికే చేస్తారన్న నమ్మకం నాకుంది." ఆత్రుతతో నిరీక్షిస్తూ అడిగింది. జానకి.

"ఏంలేదు... రామమూర్తిపోయాడు...."డాక్టర్ పరిశీలనగా ఆమె మొహంలో భావాలు గమనిస్తూ ఆగారు. ముందు జానకి ఏంఅర్థం కానట్టు చూసింది. తరవాత మొహంలో రంగులు మారాయి. డాక్టరునించి చూపులు తప్పించి, ఎదురుగా గోడకేసి స్థిరంగా చూస్తూ ఉండిపోయింది. డాక్టరుకు కొంత ధైర్యం, నమ్మకం కలిగాయి. మెల్లిగా చెప్పుకుపోసాగారు.... ....

"పోయి సుమారు మూడు నెలలు కావస్తూంది. నీపరీక్షలయ్యేవరకు నీమనస్సులో ఇంకో ఆలోచన లుండ కూడదని నీకు చెప్పలేదు.... పెద్ద జబ్బేం ఉన్నట్టు కనపడదు. కాని డెబ్భైయేపడిలో పడ్డవాడికి చావడానికి జబ్బు అక్కరలేదు! .... హు... రామమూర్తి! తన స్వార్థం, తన సుఖం! తనకెంతతోస్తే అంత తప్పించి మిగతావాళ్ళు ఎవరేం చెప్పినా వినని మొండిఘటం! తన చేతిదబ్బులు తినలేక, తనను వేగలేక, బాధలు పడలేక, ముప్పయి ఏళ్లు నిండని లేత వయస్సులో, మూడో పెళ్ళాం నిష్పంటించు కుందని ఎరిగిఉండే నీగొంతు కోశాడు! ఎంత మంది ఎన్ని రకాలుగా చెప్పారు! దిక్కులేని స్థితిలో బంగారంలాంటి అమ్మాయిని, డబ్బు కాశపడి సవతి తల్లి తొమ్మిదివందలకి అమ్మితే మాత్రం చూస్తూ చూస్తూ పది హేనేళ్ళ పసికందు బ్రతుకు నాశనం చేస్తావుటయ్యా? అరవైఏళ్ళు పైబడిన నీకు మళ్ళీ నాలుగో పెళ్ళి కావలసి వచ్చిందా? నీ మనుమరాలు వయస్సు పిల్ల జీవితం నాశనం చేస్తావా? అని నేనూ అడిగాను.

"అరడజను మంది పిల్లలు, అందరూ చిన్నపిల్లలు, ఆడదిక్కు లేకుండా వీళ్ళందరిని ఎలా పోషించను?" అని ఎదురు ప్రశ్నవేశాడు!

"పిల్లల్ని పెంచడానికి కుదుర్చు. వంటకి ఎవర్నయినా పెట్టుకో, అంతేగాని ఈ వయస్సులో పెళ్ళేమిటి? అని ఎన్నో విధాల చెప్పిచూశారు వింటేనా?"

"చివరికి నువ్వాఇంట్లో అడుగు పెట్టావు! అప్పటికింకా ఆరు నెలలు కాలేదు. ఆ యింట్లో స్నానాలగదిలో మూడో భార్య నరసమ్మ నిప్పటించు కుని! పట్టుమని పదిహేనేళ్ళు లేని నీవు, రాగానే మీదపడ్డ బంతెడు చాకిరీ, ఇంటి బాధ్యత, తండ్రి ఆఫీసుకి పోగానే, తల్లికోసం ఏడ్చే పసికూనల్ని భరించలేక, ఆమె కాలిపోయిన గదిని, ఇరుగు పొరుగు చెప్పే భర్త రాక్షసకృత్యాలని, ....వీటన్నిటికి తట్టుకోలేక ఒంటరితనంతో బెంబేలు పడిపోయావు! ఆ నరకంలో వచ్చిన నెలకే మతిస్తిమితం తప్పిందినీకు. బెదిరిపోయిన మనస్సుతో ఏదేదో అర్థంలేకుండా మాట్లాడేదానివి. అర్థం కాని చేష్టలు చేసేదానివి! అంతే! నరసమ్మ దెయ్యమై నిన్ను పీడిస్తుంది అన్నారు! భూతవైద్యుల్ని పిలిచారు. ప్రతిరోజూ దిక్కుమాలిన ప్రతీ వెధవా భూతవైద్యుల పేరున, నీ జుట్టు పట్టుకుని పేకబెత్తాలతో, పాత చెప్పులతో కొడుతూంటే, పక్కింటినించి వింటూ నేనెంత క్షోభపడ్డానో ఏం చెయ్యలేని అశక్తితో నాగుండె ఎలా తరుక్కుపోతుందో భగవంతుడికే తెలియాలి!

"పవిత్ర భారతస్త్రీని భర్త, హత్య తప్పించి, మిగతావి ఏం చేసినా తప్పులేదు. చుట్టుపక్కల ఎవరూ జోక్యం కలిగించుకో కూడదు! ఏం చేస్తున్నా అడిగే హక్కు ఎకరికీ లేదు. నరసమ్మ వదిలితే అంతకు ముందు లక్ష్మమ్మ, పట్టుకున్నారన్నారు! చివరికి ఈ భూతవైద్యుల చేతుల్లో నీచావు నిజమని నిర్ణయించుకున్నాను. ఇరవై శతాబ్దం ఉత్తరార్థంలో

కూడా ఇంతటి మనుషులూ ఉంటారనుకోడం, ఉండడం నమ్మలేని ఘోరం! కాని ఉన్నారని తెలిసి ఏం చెయ్యలేని అశక్తత, అసహాయత ఇంకా ఘోరం!

"ఓవరికి ఒక రోజు నా దగ్గిరికి వచ్చాడు రామమూర్తి. నువ్వు ప్రాణాపాయ స్థితిలో ఉన్నావు. భూత వైద్యుల బెత్తాల వాతలు ఒంటి నిండా తట్లుతేలాయి! ఒళ్ళు అంతా కాలిపోతున్నట్టు విపరీతమైన జ్వరం. రెండు మూడు రోజులనించి తిండి, నీరు లేకుండా స్పృహలేని స్థితిలో ఉన్నావు. రామమూర్తి చాలా గాభరాపడ్డాడు. మనిషి ఇంచుమించు ఏడ్చే స్థితిలో ఉన్నాడు. చాలా డీలా పడి పోయాడు. డబ్బు నష్టపోయాడు. నీ నించి వచ్చిన సుఖమూ లేదు. 'ఈ నాలుగో భార్యకూడా పోతే, మళ్ళీ ఎవరయినా పిల్లని ఇస్తారా? అన్న ధోరణిలో చాలా ఆత్రుతతో నిన్ను ఎలాగైనా బతికించమని ఆ స్థితిలో నా చేతిలో పెట్టి కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

"నాకు అవకాశం వచ్చింది అప్పటికి, కోపంతో శరీరం దహించుకు పోతుంటే కసితీరా తిట్టాను. 'నువ్వు బ్రతికే ఆశలేదని, ఇది హత్య అని పోలీసులకు రిపోర్టు ఇస్తానని బెదిరించాను. భయపడిపోయాడు మనిషి. 'చచ్చిన పామును ఇంకా ఎందుకు కొడతారు? బుద్ధి గడ్డితిని ఈ పాపానికి ఒడిగట్టాను. చెంపలు వాయించుకుంటున్నాను. ఎలాగో అలాగ ఆమెను బ్రతికించండి. మీరేమి చెయ్యమంటే అది చేస్తాను?' అంటూ ప్రాధేయ పడ్డాడు. ఈ భూతాలను తరమడంలో నీ ప్రాణాలు కూడా పోతున్నాయని అప్పటికి గాని తట్టలేదు ఆ దౌర్భాగ్యుడికి! ఆ చావుకు తనే కారకుడన్న పాపభీతి మాట ఎలా ఉన్నా, పోలీసులకు ఎక్కువగా భయపడ్డాడేమో! ఏమయినా నా చేతిలో చిక్కాడు. ఆ అవకాశం పోనీయకుండా సాధ్యమైనంత బెట్టు చూపించి, అఖరికి తన తప్పులు తన నోటే చెప్పించి, నేను

కొన్ని షరతులు పెట్టాను.

"నీకు చికిత్స నా ఇంట్లోనే జరుగుతుంది. నీకెప్పుడు నయమైంది నిర్ణయించేది నేను. నేను చెప్పిందాకా నీ దరిదాపులకి రాగూడదు. నీ ప్రసక్తి ఎత్తడానికి వీలులేదు. ఇంచుమించు భర్తగా నీ మీద అధికారాలన్నీ వదులు కున్నట్టే. అలా రాసిఇస్తేనే నేనేమైనా చెయ్యగలననీ, లేకపోతే ఈ చావుకు మీరు కారణమని పోలీసులకు రిపోర్టు ఇస్తానని చెప్పాను. ఇబ్బందిలో ఉన్నాడేమో, ముందు కాస్త సంశయించి, తటపటాయించి నే నన్నదాని కంతటికీ అంగీకరించాడు పైగా డబ్బు అక్కరలేదన్నానేమో, ఈ పీడ వదలితే చాలుననుకుని ఉంటాడు. ఆ రోజునించే నిన్ను మా ఇంటికి తెచ్చి వైద్యం మొదలుపెట్టాను. పిల్లలకు, వంటకు ఎవరినో కుదుర్చుకున్నాడు"

"నిన్ను ఆ మనుష్యులకు, ఆ వాతావరణానికి దూరంగా ఉంచడం కోసం, ప్రయత్నించి అక్కడినించి బదిలీ కోరుకుని ఈ వూరు వచ్చాను" డాక్టరు అంతవరకు చెప్పి ఆగారు. జానకి ఏడుస్తోంది, తలగడలో మొహం దాచుకుని. ఆయన లేచి జానకి దగ్గిరికి వెళ్ళి ఆప్యాయంగా తల నిమిరారు.

"అమ్మా! జానకీ బాధపడుతున్నావా? అవును! ఎంత బండరాతి గుండె లయినా కరుగుతాయి ఆ విషయాలు తలుచుకుంటే!.... కాని నువ్వు అదంతా పీడకల అనుకుని మరిచిపోవాలి!.... కనీసం ప్రయత్నించు!.... పోనీ నీకు అంతగా మనస్సు బాగులేకపోతే ఇంకోసారి మాట్లాడుకుందాం, నేను వెళతాను...."

"కూర్చోండి నాన్నగారూ, పరవాలేదు. ఏంచెప్పినా వినడానికి తయారుగా ఉన్నాను. చెప్పండి!" జానకి లేచి కూర్చుంది. కళ్లు ఎర్రబడి, గొంతు కంపిస్తూ అంది. కాని ఆమెలో ఒక కొత్త స్థయిర్యం నిశ్చలత కనపడ్డాయి. ఆమె ఇదివరకటి జానకి కాదు.

"జరిగింది అంతా మన మంచికే నమ్మా. రామమూర్తి నీ మెళ్లో తాడు కట్టాడు కాని, నీతో ఎన్నడూ కాపురం చేసి ఎరగడు. నువ్వు అతని భార్యగా ఎన్నడూ ఉండలేదు. చివరికి ఆ ఉన్న బంధం కూడా తెగిపోయింది.... అతను ఏదో చచ్చేదాకా ఏదో కాస్త డబ్బు సంపాయించి వెనక వేశాడు. తాతలనాటి భూములు, ఆస్తి ఉన్నాయి. వాటికి ఆశపడి అతని తమ్ముడూ వాళ్లూ పిల్లల్ని చేరదిస్తారు. ఆ బెంగ కూడ నీ కక్కరలేదు."

డాక్టరుగారి మనస్సులో భావం జానకికి కొద్దికొద్దిగా అర్థం అవుతూంది. ఎన్నో విషయాలు ఒక్కసారి తెలియడం మూలాన, ఒక మారిరి దిగ్భ్రమ ఆమెను ముంచెత్తింది. ఏదీ వెంటనే తోచడం లేదు.

"నేను చెప్పేదేం లేదు, నువ్వు ఇంక ఆ బంధాన్ని తెంచుకో! కాలేజీలో చేర్పిస్తాను. ఓపికఉన్నంత వరకు చదువుకో! తరవాత ఏదో ఉద్యోగం దొరకకపోదు! క్రొత్త జీవితాన్ని ఆరంభించు. గతమంతా జరగనట్లే అనుకుందాం! ఈ ఇంట్లో రాజేశ్వరి ఎంతో నువ్వు అంతే! నా ఉద్దేశం నువ్వు మళ్లీ ఆ వాతావరణంలో అడుగుపెట్ట కూడదు! ఇప్పుడు మామూలు మనిషి అయినా, నీలో ఎంత నిబ్బరం ధైర్యం వచ్చినా, తిరిగి ఆ మనుష్యుల మధ్యకు వెళ్లి, వాళ్ల మాటలు విన్నావంటే, నీకేమౌతుందో నేనూ వూహించలేను! ఇన్నాళ్లు నా శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అందుకే నువ్వింక ఆ బంధాన్ని మరిచిపోవాలని నా కోరిక!"

జానకి ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. మౌనంగా. డాక్టరు ఆమెను ఆలోచించుకోవడానికి అవకాశం ఇస్తూ, నెమ్మదిగా లేచి వెళ్ళిపోయారు.

మరునాడు ఉదయం రాజేశ్వరి తండ్రి గదిలోనికి హడావిడిగా పరిగెడుతూ వచ్చింది.

"నాన్నా. జానకి లేదు నాన్నా! పెట్టె, బట్టలు లేవు మంచం మీద

యీా ఉత్తరం పడవుండి." గాభరాగా అంది రాజేశ్వరి.

డాక్టరుగారు దాన్ని తెరిచి చదివారు.

"మహారాజశ్రీ నాన్నగారికి,

దేవుడిలాంటి మిమ్మల్ని ఇలా చనువుగా పిల్చుకోగల అవకాశంనాకు కలగటం నేను కలలో కూడా వూహించలేని మహా గౌరవం! మీరు నాకు ప్రాణం పోసిన మహాత్ములు! అంతకన్నా ముఖ్యం జీవచ్ఛవంలా ఏదో నరకంలో కొట్టుకుంటున్నదానికి, కూపస్థమండూకం లాంటి జీవితంలోవెలుగు చీకటికి భేదం తెలియనినాకు. ప్రేమభిక్షపెట్టి, వెలుగుబాట చూపారు. మీకు ఋణపడి ఉన్నానని చెప్పడానికి కూడ వీలులేని పరిస్థితినాది. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలం మానవతకోసం, సాటి ప్రాణంమీద మమకారంతో, దయతో నన్ను చేరదీశారు. కరుణతో, ప్రేమతో నన్ను తేరించి నాలో క్రొత్త వెలుగు ప్రసరింప చేసి నన్ను క్రొత్త మనిషిగా రూపొందించారు. దీన్ని ఋణమని ఎలా అనను? దానికి ప్రతిగా నేను మీకు చెయ్యకలిగిందేముంది?

"కానీ ఏదో ఒకటి చేయాలన్న ఆరాటం మనస్సుని వేధిస్తూంది. అందురు మీరు వెలిగించినబాటే, మీరు నడిపిన మార్గమే నాకళ్ల ఎదుట కనపడుతూ ఉంది. మీకు అంతటి ఉదాత్తత, అవుదార్యం, విశాల హృదయం నాకులేకపోయినా, నా చేతనయినంతలో, నేను పొందిన ఈ దయ, కరుణను ప్రేమ, ఇతరులకు దొరికేటట్లు చెయ్యాలని నిశ్చయించు కున్నాను.

"క్షమించండి మీ సలహా పాటించిక పోయాను! నిన్నటినించి నేను బాగా ఆలోచించి ఈ నిశ్చయానికి వచ్చాను. రామమూర్తిగారు, వాస్తవంగా నా భర్తగా ఉండకపోయినా ఆయన నాకు తాళికట్టిన భర్త! ఆపిల్లలు, నా పిల్లలు, అనుకుంటాను. నా సుఖం, నా స్వార్థంకంటె, చేతనయినంతలో

ఇతరులకు ఉపయోగపడంలో ఎంతటి ఆనందం, ఆత్మతృప్తి ఉంటాయో తెలుసుకున్నాను. మీ సహచర్యంలో ఆ తల్లిదండ్రిలేని పసిపిల్లలను, మాతృ ప్రేమకునోచుకోని ఆ పసిబిడ్డలకు మాతృప్రేమ చవి చూపించ దలుచు కున్నాను. ఆ వాతావరణంలో పెరిగితే ఆ పిల్లలకి నాకు పట్టిన గతే పడుతుం దన్నది నిశ్చయం. నేను అనుభవించిన నరకంలో చూస్తూ చూస్తూ వాళ్లను పడెయ్యలేను. అందుకే వెళ్లిపోతున్నాను.

"వెళ్లేముందు మీనించి సెలవు తీసుకోకుండా వెళ్లి పోవడం నాకు చాలా కష్టంగా ఉంది. చూస్తూ చూస్తూ నన్ను తిరిగి ఆ చీకటికి పంపరన్న నిజం నాకు తెలుసు! కాని మీరేమీ భయపడ నక్కరలేదు. ఆ జానకి చచ్చి పోయింది! ఈ జానకి వేరు! ఎలాంటిసంఘటన అయినా ఎదుర్కోగల ధైర్యం నిబ్బరం, మీరు ప్రసాదించారు. అందుకే ఇంత సాహసిస్తున్నాను.

"అపార దయాసముద్రులు మీరు. ఇన్నాళ్లు మీ కన్నకూతురులాగే చూసుకున్నారు. మీకూతురులాగే అనుకుని ఈనా ఒక్కతప్పు మన్నించండి.

"నేను తల పెట్టిన పనిలో మీ ఆశీస్సులు ఉంటాయని నాకు తెలుసు. అయినా నాతృప్తికోసం ఆశీర్వదించమని వేడుకొంటున్నాను. ఇంకోసారి నా ఈ చౌరవ మన్నించమని కోరుతున్నాను.

సెలవు

మీ అమ్మాయి

"జానకి"

డాక్టరు నిర్ఘాంతపోయారు. కొద్ది క్షణాలు పోయాక నీరు చిందిన కళ్లు ఒత్తుకుంటూ "వెర్రితల్లి! ఎంతపని చేశావమ్మా!" అని నిట్టూర్చారు.

(ఆంధ్రప్రభ దిన పత్రిక)